RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



సంపుటి :18 | సంచిక : 299 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 4-9- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 299 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 4-9-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

### అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో

## మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు

వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో

నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు

భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ

తరువాయి 2లో..



## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు

రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్

స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి

ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్

తరువాయి 2లో..



### అమెరికా భారీ ఆపరేషన్..

## హర్మూజ్ దాటిన 40 వాణిజ్య నౌకలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా 40 వాణిజ్య

తరువాయి 2లో..

## టీటీడీలో అవినీతి తిమింగలం..

డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట్లో కిలోల కొద్దీ బంగారం, నోట్ల కట్టలు

టీటీడీ శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం ఇళ్లపై ఏసీబీ దాడులు

ప్రభుత్వ విలువ ప్రకారం రూ.5 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ.12.5 లక్షల నగదు స్వాధీనం

కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో పలుచోట్ల ఇళ్లు, స్థలాలు

కొనసాగుతున్న సోదాలు.. మరింత పెరగనున్న ఆస్తుల విలువ

**తిరుపతి, సిటిజన్ టైమ్స్**

టీటీడీలో ఓ ఉన్నతాధికారి అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న మెండు లోకనాథం ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న ఏకకాలంలో దాడులు నిర్వహించారు. తిరుపతిలోని ఆయన నివాసంతో పాటు

తరువాయి 2లో..



### ఘోరంగా ఓడింది గాక..

## తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డు సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ మండి పడ్డారు. అయితే, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ మాత్రం తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకుంటున్నాడు. అదే సమయంలో జట్టు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న టీమ్‌ల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు. “మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. ఇటీవల కాలంలో చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతటితో అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా? మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. ఎవరైనా రాణించకపోతే లేదా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోతే మేమేం (గ్రాజదీ) చేయగలం? మాకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ఎంతో ముఖ్యం. కచ్చితంగా టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన దానిని తప్పుగా పరిగణించలేం. మేం ఈ

తరువాయి 2లో..

### రష్యా-ఉక్రెయిన్ యుద్ధం..

## శాంతి ప్రయత్నాలకు భారత్ సిద్ధమే



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మధ్యవర్తిత్వం సహా ఎలాంటి సహాయం అందించేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాలు కోరితే శాంతి స్థాపనకు కృషి చేస్తామన్నారు. యుద్ధక్షేత్రంలో ఈ వివాదం పరిష్కారం కాదు అనేది భారత్ వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చలతోనే వీటికి ముగింపు ఉంటుందన్నారు. శాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

### జల వివాదాలు కాదు.. జల జాగ్రత్తలు ముఖ్యం!

రెండు తెలుగు రాష్ట్రాల మధ్యేకాదు.. దేశంలోని అనేక రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగుతున్నాయి. కర్ణాటక-తమిళ నాడు, కేరళ-కర్ణాటక, మహారాష్ట్ర-తెలంగాణ, ఏపీ-తెలంగాణ, పంజాబ్-హరియాణ ఇలా.. ఏ రెండు సరిహద్దు రాష్ట్రాలను తీసుకు న్నా.. జల వివాదాలు కనిపిస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కూడా కొన్ని రాష్ట్రాల్లో ఈ వివాదాలు కొనసా గుతున్నాయి. అయితే.. ఈ విషయానికి పరిష్కారం ఎప్పుడు? అనేది మాత్రం ఎడతెగని ప్రశ్నగానే మారింది. ఈ వ్యవహారం అటుకేంద్ర ప్రభుత్వానికి కూడా ఇరకాటంగా మారిపోయింది. జాతీయ స్తాయిలో జల వివాదాలు పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రిబ్యునళ్లు ఉన్నా.. అవార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక కమిటీలు ఉన్నా.. పరిష్కారం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఈ విషయంపై తాజాగా అటు ప్రధాని నరేంద్ర మోడీ.. ఇటు సీఎం చంద్రబాబుకూడా ఒకే రోజు వేర్వేరు చోట్ల ప్రస్తావించారు. -జల వివాదాలు కాదు.. జల జాగ్రత్తలు ముఖ్యం-- అని ఇరువురు తేల్చి చెప్పారు. పంతానికి పోతున్న రాష్ట్రాలు జలాలను వృథాగా సముద్రంలో కలిసిపోయినా ఇష్టపడుతున్నాయని.. వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదన్నది ఇరువురు నేతల ఆవేదన. ఢిల్లీలో జరిగిన రెండు రోజుల తొలి జలసదస్సు ముగింపు సందర్భంగా అటు ప్రధాని.. ఉత్తరాంధ్రకు గోదావరి నీటిని మళ్లించే సందర్భంగా ఇటు సీఎం చంద్రబాబు.. ఇదే విషయాన్ని చెప్పుకొని రావడం గమనార్హం. ఇరువురు నేతల అభిప్రాయాలు ఒక్కటే.. సమర్థవంతమైన జల వినియోగం.. జల సంరక్షణ చర్యలతోపాటు.. నదుల అనుసంధానం. ఈ విషయాలు పాటిస్తేనే దేశంలో కరువు పీడిత ప్రభావిత జిల్లాలకు న్యాయం జరుగుతుందన్నది వారి వాదన. ఇప్పటికే నదుల అనుసంధాన మంత్రాన్ని సీఎంచంద్రబాబు పఠిస్తున్నారు. ప్రధాని ఈ విషయాన్ని సాధించగలరని కూడా చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలోని రెంటిండ మూడు వంతుల జనాభాకు(వందలో 30 మంది) సరైన తాగునీరు లేదన్నది వాస్తవం. అంతేకా దు.. 43 శాతం భూములకు ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. ఈ పరిణామాలతోనే కరువు రక్కసి వెంటాడుతోం ది. దీనికి తోడు రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదం కూడా మరింత పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని సమూలంగా మార్చాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. దీనికి ముందుకు వచ్చే రాష్ట్రాలను ఆయన ఆహ్వానిస్తున్నారు. ఇదే విషయాన్ని అటుప్రధాని కూడా ప్రస్తావించడం గమనార్హం. సో.. మొత్తంగా జల వివాదాల కంటే కూడా జల జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్నినొక్కిచెబుతున్నారు.

## హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్ట్

**పొదిలి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03:**

హత్యాయత్నానికి పాల్పడ్డ ఒక నిందితుడిని పొదిలి పోలీసులు అరెస్టు చేశారు. పొదిలి ఎస్ ఐ సూరెడ్డి రాజేష్ అందించిన వివరాల మేరకు పట్టణంలోని నవాబ్ మిట్ట ప్రాంతానికి చెందిన షేక్ మీరావలి అనే 45 సంవత్సరాల వ్యక్తి పొదిలి మజరా గ్రామమైన కాటూరి వారి పాలెం కు చెందిన సోము ప్రసాద్ అనే అతనిపై ఈ నెల ఒకటో తేదీ రాత్రి గొడవ తన వద్ద ఉన్న బీరు సీసాతో దాడి జరిపి పొడిచి గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ ఐ రాజేష్ వివరించారు. ఈ సంఘటనలో నిందితుడైన మీరావలి నీ గురువారం సాయంత్రం పట్టణ శివారులోని మర్రిపూడి అడ్డరోడ్డు ప్రాంతంలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితుడిని స్థానిక కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్సై రాజేష్ చెప్పారు.




## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు

మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని ఆన్నారు.

## టీటీడీలో అవినీతి తిమింగలం..

బంధువుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. తొలిరోజు సోదాల్లోనే ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.5 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల విలువ ఇంకా చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇవాళ కూడా తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

కిలోల కొద్దీ బంగారం.. భారీగా నగదు

ఏసీబీ అధికారులు తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లోని లోకనాథం ఇంట్లో జరిపిన సోదాల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. బీరువాలో దాచిన 2 కిలోల బంగారు ఆభరణాలు, 6.5 కిలోల వెండి వస్తువులు, రూ.12.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు, ఒక జీ౦3 భవనం, మరో జీ౦1 భవనానికి సంబంధించిన కీలక పత్రాలను కూడా అధికారులు గుర్తించారు. లోకనాథం, ఆయన కుమారుడి పేరుతో బ్యాంకుల్లో ఉన్న నాలుగు ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. అయితే, ఆయన పేరుతో ఉన్న బ్యాంక్ లాకర్‌ను తెరిచి చూడగా అందులో ఏమీ లభించలేదు.

బంధువుల పేర్లతో ఆస్తుల బదలాయింపు

లోకనాథం తన అక్రమాస్తులను ఎక్కువగా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో తేలింది. ఆయన భార్య మంజుల పేరుతో తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఒక ఇల్లు, గొల్లవానిగుంటలో రెండు ఇంటి స్థలాలు, వడమాలపేట మండలంలో ఒక ప్లాట్ ఉన్నట్లు గుర్తించారు. ఆయన కుమారుడి పేరుతో తిరుపతి శ్రీనివాసనగర్‌లో ఓ ఇంటి స్థలం ఉంది. లోకనాథం భార్య, మరొకరి పేరుతో ఉమ్మడిగా రూ.31.98 లక్షల విలువైన మరో ఆస్తి ఉన్నట్లు తేలింది. సోదాల్లో భాగంగా లోకనాథం బావలు మునికృష్ణ, రమేశ్ ఇళ్లతో పాటు సోదరుడు వేణు ఇంట్లోనూ తనిఖీలు నిర్వహించారు. అక్కడ కూడా నగదు, బంగారంతో పాటు 10 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు లభ్యమైనట్లు సమాచారం.

కారుణ్య నియామకంతో ఉద్యోగంలో చేరి..

వాస్తవానికి లోకనాథం 1989 ఫిబ్రవరి 1న కారుణ్య నియామకం కింద టీటీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. అనంతరం పదోన్నతులు పొందుతూ సీనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఈవో, డిప్యూటీ ఈవో స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన, గతంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలోనూ పనిచేశారు. తిరుమలలోని ఆయన క్వార్టర్స్‌ను ఏసీబీ అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో అక్రమాస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. శ్రీవారి ఆలయంలో కీలక బాధ్యతల్లో ఉన్న అధికారి ఇంత భారీ అవినీతికి పాల్పడటం తిరుపతిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## నిరంతర విద్యుత్ సరఫరాకు ప్లాంట్లను సిద్ధం చేయాలి

### ఎల్‌నినో ప్రభావంతో 275 మిలియన్ యూనిట్లకు పైగా చేరిన వినియోగం.

### అధికారుల సమీక్షలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి ఆదేశం.

**అమరావతి**
**సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03:**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. సచివాల యంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రస్తుత విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి సామర్థ్యం, ప్లాంట్ల పనితీరు, భవిష్యత్తు అవసరాలపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో వినియోగం భారీగా పెరిగిందని మంత్రి



పేర్కొన్నారు. గతంలో రోజుకు సగటున 218 మిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ వినియోగం ప్రస్తుతం 275 మిలియన్ యూనిట్లకు పైగా చేరిందని, రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఉత్పత్తి ప్లాంట్లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు నిర్వహణ, అవసరమైన మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా ప్రతి ప్లాంట్‌లో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరగాలి..**

రాష్ట్ర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌర, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ 'పీఎం సూర్యఘర్' పథకాన్ని ప్రజలు మరింత ఎక్కువగా వినియోగించుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి పడకుండా ఉత్పత్తి, పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఇతర ఇంధన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన, యాంటీ ర్యాగింగ్ పై అవగాహన పై సదస్సు

**పుట్టపర్తి , సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03:**

పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బి.టెక్ విద్యార్థుల ఓరియంటేషన్ లో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన, యాంటీ ర్యాగింగ్, పోక్సో చట్టలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుట్టపర్తి డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలతో ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్ యువత భవిష్యత్తునే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. కళాశాలల్లో ర్యాగింగ్ కు తావు లేదని, ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈగల్ టీమ్ ఎస్ఐ.కె. శ్రీహరి మాట్లాడుతూ. మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద కార్యకలాపాలను పోలీసుల దృష్టికి తేవాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులందరితో "మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం అని, డ్రగ్స్ కార్యకలాపాల్లో పాల్గొనబోము అని, ఇతరులను కూడా దూరంగా ఉంచేందుకు కృషి చేస్తాం" అని ప్రతిజ్ఞ




చేయించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు పాల్గొని పోక్సో చట్టం, మహిళా భద్రత, సైబర్ భద్రత, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పోలీసు అధికారులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కృతజ్ఞతలు తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

### రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. శాంతి ప్రయత్నాలకు భారత్ సిద్ధమే

అయిన కొన్ని రోజులకే విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఉక్రెయిన్ పర్యటనలో ఉన్న ఎస్ జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో భద్రతా పరిస్థితులపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా భారత నావికులపై జరుగుతున్న దాడులపై జైశంకర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలాఉంటే, మూడు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లలో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఆయా దేశాల దౌత్యవేత్తలతో చర్చించనున్నారు.

### అమెరికా భారీ ఆపరేషన్.. హర్మూజ్ దాటిన 40 వాణిజ్య నౌకలు

నౌకలకు అమెరికా సైన్యం రక్షణ కల్పించింది. ఈ ఆపరేషన్‌లో సుమారు 18 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలిస్తున్న నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యుద్ధం వేళ ఒక రోజులో హర్మూజ్ మీదుగా ఇంత భారీ సంఖ్యలో నౌకలకు అమెరికా నౌకాదళం రక్షణ కల్పించడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి సైనిక ఘర్షణలు చోటుచేసుకోవడంతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు ముప్పు పెరిగింది. ఇటీవల అమెరికా బలగాలు.. ఇరాన్‌కు చెందిన రాడార్, క్షిపణి వ్యవస్థలతోపాటు తీర ప్రాంతంలోని పలు లక్ష్యాలపై దాడులు చేపట్టాయి. అటు టెహ్రాన్ కూడా ప్రతిదాడులకు పాల్పడుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలోనే హర్మూజ్ నుంచి చమురు రవాణాకు అమెరికా ఈ ఆపరేషన్ చేపట్టింది. అయితే తాజా పరిణామాలను చూస్తుంటే యుద్ధం ముగిసే అవకాశాలు కన్పించట్లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకురావడం అమెరికాకు అత్యంత కీలకంగా మారిందని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గతంలో సైనిక లక్ష్యాలపై విస్తృతంగా దాడులు చేసిన అమెరికా.. ఇప్పుడు ఈ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పును తొలగించడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

### ఘోరంగా ఓడింది గాక.. తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు

రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాం. కానీ, దేవుని దయతో వన్డేలు, టీ20ల్లో మాదిరిగానే రాబోయే రోజుల్లో టెస్టుల్లో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా. నేను విమర్శలకు ఎప్పుడూ భయపడలేదు, ఇకపై కూడా భయపడను. నేను పీసీబీ చీఫ్‌గా వచ్చినప్పటి నుంచి క్రికెట్ నాశనమైందని అనేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మేం ఈ కోచింగ్ బృందాన్ని తీసుకురాకముందు జట్టు ర్యాంకింగ్స్ ఎలా ఉండేవో చూడండి. వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చాం" అని మోసిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం ముక్కోణపు టీ20 సిరీస్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాకు చుక్కెదురైంది. ఈ ఫలితాలను ఉద్దేశించే మోసిన్ నఖ్వీ తాజాగా ఈ తరహా వ్యాఖ్యలు చేశాడని, పీసీబీ చీఫ్ జట్టును సరైన దారిలో నడిపించకుండా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు

నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

# పెండింగ్‌కు చెక్.. రెవెన్యూపై డ్రైవ్ మోడ్

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03:**
రెవెన్యూ శాఖకు సంబంధించిన దీర్ఘకాలిక, క్లిష్టమైన సమస్యలను ప్రత్యేక దృష్టితో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యకు నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించుకుని డ్రైవ్ మోడ్‌లో పనిచేస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. విశాఖపట్నం, భీమిలి రెవెన్యూ డివిజన్లకు సంబంధించిన రెవెన్యూ కాన్ఫరెన్స్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి కలెక్టర్ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, బల్క్ ఇష్యూస్, 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్, ఆక్రమణల క్రమబద్ధీకరణ, మాన్యువల్ దరఖాస్తుల పరిష్కార స్థితి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, చెరువులు, ఇతర జలవనరుల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయిన వారికి నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్ అంశాల పరిష్కారంలో వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పురోగతి సాధించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి వాటి పరిష్కారానికి డ్రైవ్ మోడ్‌లో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న వినతులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని, ఒకే సమస్య కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు అధికారుల దృష్టికి రాని క్లిష్టమైన రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా ప్రత్యేకంగా తెలుసుకుని నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు సులభంగా సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. మెట్రో, రైల్వే వంటి కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి అంశాన్ని గుర్తించి పూర్తి చేయడంతో పాటు స్పష్టమైన కాలపరిమితితో లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సకాలంలో చేరుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో పాటు డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, అనిత, మాధవీలత, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలే లక్ష్యంగా కాంగ్రెస్ వార్డుల పర్యటన





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03**
కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గ ఇంచార్జి ప్రియాంక దండి ఆధ్వర్యంలో నియమితమైన ఐదుగురు సభ్యుల కమిటీ ఆరిలోవ ప్రాంతంలోని 11, 12, 13వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించింది. పీసీసీ, డీసీసీ కమిటీ సభ్యులతో ఏర్పాటైన ఈ బృందంలో మహేష్, సునంద దేవి, రజియా బేగం, సుధాకర్, ఆలీ పాల్గొని స్థానిక ప్రజలను కలిసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వార్డుల వారీగా ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తిస్తున్నామని తెలిపారు. ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి వార్డుకు ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించి విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిష్కారం కాని సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు చింతపల్లి వెంకటేష్, పొట్నూరు నాగేంద్ర, ఫర్వీన్ ఖాన్, సీనియర్ నాయకులు వేమూరి సురేష్, ఈగల మోహన్ సాయి, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై పూజిత విజయం

**భూటాన్‌పై భారత జట్టు గెలుపు..**

**డీఈవో అభినందనలు, నగదు ప్రోత్సాహం**



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03**
అంతర్జాతీయ స్థాయి గోల్ షాట్‌బాల్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి భూటాన్‌పై విజయం సాధించిన వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని తాతపూడి పూజితను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ అభినందించారు. గత నెల 24 నుంచి 27 వరకు జరిగిన అండర్-15 గోల్ షాట్‌బాల్ ఫైనల్ పోటీల్లో పూజిత ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తీసుకువచ్చిందని ఆయన ప్రశంసించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. పూజితను ప్రోత్సహించేందుకు రూ.5 వేల నగదు బహుమతిని ప్రకటించారు. పూజితకు శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు తోనంగి సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడిశెట్టి రమేష్‌కుమార్‌లను డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొని పూజితకు అభినందనలు తెలిపారు.

# చెక్ పాయింట్ లో మద్యం బాటిళ్లు స్వాధీనం

**అలిపిరి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03**
తిరుమల అలిపిరి చెక్ పాయింట్ వద్ద నిఘవర్గాలు మళ్ళీ అప్రమత్తమయ్యాయి. భద్రత సిబ్బంది నిర్వహించిన సాధారణ స్కానింగ్ తనిఖీల్లో తిరుపతి లీలామహల్ సెంటర్కు చెందిన కే బాబ్జి అనే వ్యక్తి నుంచి తొమ్మిది ఓల్డ్ అడిర్మల్ మద్యం క్వార్టర్ బాటిల్లతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రానికి మద్యం రవాణా చేయడానికి యత్నించిన నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.



# మాన్సాస్ భూముల ముడి విప్పేదెప్పుడు..?

## నాలుగు గ్రామాల రైతుల సమష్టి పోరుకు సన్నాహాలు



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 03**
ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా రైతులను వెంటాడుతున్న మాన్సాస్ భూముల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. తమ భూములపై నెలకొన్న సందిగ్ధతను తొలగించి న్యాయం చేయాలని కోరుతూ ఆనందపురం మండలంలోని బోని, మద్ది, శిర్లపాలెం, ముకుందపురం గ్రామాలకు చెందిన రైతులు సమష్టి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. సమస్య పరిష్కారం కోసం గ్రామాల వారీగా భూముల వివరాలను సేకరించి అధికారుల ముందు సమగ్రంగా ఉంచాలని నిర్ణయించారు. ఈ మేరకు బోని గ్రామంలో సూరాల సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. నాలుగు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొని తమ భూములకు సంబంధించిన సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చించారు. మాన్సాస్ పరిధిలో ఉన్న భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం, ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న వివరాలు, భూములపై ఉన్న హక్కుల పరిస్థితిని గ్రామాల వారీగా సేకరించాలని నిర్ణయించారు. భూసమస్య పరిష్కారానికి ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమైనట్లు రైతులు తెలిపారు. ఇటీవల సూరాల సత్య వరప్రసాద్ నాగవంశం డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ హోదాలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి రైతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. మాన్సాస్ భూములకు సంబంధించి రైతుల వద్ద ఉన్న పూర్తి వివరాలను అర్జీ రూపంలో సమర్పిస్తే సమస్యపై సమగ్ర పరిశీలన చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు సూచించిన నేపథ్యంలో రైతులు కార్యాచరణను వేగవంతం చేశారు. ఒక్కొక్కరిగా కాకుండా నాలుగు గ్రామాల రైతులందరి భూమి వివరాలను ఒకే చోట సేకరించి సమష్టిగా అధికారులకు సమర్పించాలని నిర్ణయించారు. ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రైతులంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. భూములకు సంబంధించిన పాత పత్రాలు, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులను సేకరించి సమగ్ర నివేదిక రూపొందించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులందరూ సమన్వయంతో వ్యవహరించి అవసరమైన ఆధారాలను అధికారులకు అందజేస్తే సమస్య పరిష్కారానికి బలమైన మార్గం ఏర్పడుతుందని సూరాల సత్య వరప్రసాద్ పేర్కొన్నారు. నాలుగు గ్రామాల రైతుల సమష్టి ప్రయత్నం మాన్సాస్ భూసమస్య పరిష్కారానికి ఎంతవరకు దోహదపడుతుందో వేచి చూడాల్సి ఉంది.

# విశాఖ ఉక్కు భూముల అమ్మకాలకు ముహూర్తం..!

**459 ఎకరాల విక్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్..**

**ఈ-వేలానికి రంగం సిద్ధం**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03 :**
విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన విలువైన భూముల విక్రయ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధీనంలో వినియోగంలో లేని, అదనపు భూములను విక్రయించే కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన భూములను ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు రంగం సిద్ధమవుతోంది. విశాఖ ఉక్కు పరిశ్రమకు చెందిన సుమారు 459 ఎకరాల భూములను విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల నగదీకరణ ప్రక్రియలో భాగంగా ఈ భూములను విక్రయానికి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంతో తదుపరి ప్రక్రియ వేగవంతం కానుంది. ప్రధానంగా విశాఖ నగర పరిధిలోని విలువైన భూములను దశలవారీగా ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. భూముల వివరాలు, మార్కెట్ విలువ, వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించి విక్రయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నట్లు సమాచారం. ఇప్పటికే విశాఖ ఉక్కు పరిరక్షణ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, ఉక్కు కర్మాగారానికి చెందిన భూముల విక్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం మరోసారి రాజకీయ, కార్మిక వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. విశాఖ ఉక్కు కర్మాగారం ఆస్తుల పరిరక్షణపై ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలో భారీ విస్తీర్ణంలోని భూములను విక్రయించేందుకు చర్యలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. భూముల విక్రయ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉందని సమాచారం. కేంద్ర నిర్ణయంతో విశాఖ ఉక్కు భూముల అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

# అడుగడుగునా నిఘా నేత్రాలు..

# తప్పు చేస్తే తస్మాత్ జాగ్రత్త..!

## ప్రధాన కూడళ్లలో అధునాతన కెమెరాలు.. పోలీసుల భద్రతా చర్యలపై ప్రశంసలు





**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబరు 3**
ఇకపై ప్రధాన కూడళ్లలో ప్రతి కదలిక నిఘా నేత్రాల కంట పడనుంది. నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రతను మరింత పటిష్ఠం చేసే లక్ష్యంతో ఆనందపురం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోయపాలెం జంక్షన్, భీమిలి క్రాస్‌రోడ్ జంక్షన్లలో అధునాతన బహుళ తెరల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగనుంది. నగర పోలీసు కమిషనర్, డీసీపీ-1 ఆదేశాల మేరకు గురువారం భీమిలి క్రాస్‌రోడ్, బోయపాలెం జంక్షన్లలో ఒక్కొక్కటి చొప్పున రెండు అధునాతన నిఘా కెమెరా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే ఈ కూడళ్లలో వాహనాల రాకపోకలు, అనుమానాస్పద కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ వ్యవస్థలు ఉపయోగపడనున్నాయి. ఏదైనా నేర ఘటన జరిగినప్పుడు దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని సేకరించడంలోనూ, రహదారి ప్రమాదాలపై స్పష్టత పొందడంలోనూ కెమెరాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రధాన కూడళ్లపై నిఘా వ్యవస్థను విస్తరించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెరగడంతో అసాంఘిక శక్తులకు కళ్లెం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకపై తప్పు చేయాలనుకునే వారు కూడా చుట్టూ ఉన్న నిఘా నేత్రాలను గుర్తుంచుకోవాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా భీమిలి క్రాస్‌రోడ్‌లోని పోలీసు చెక్‌పోస్ట్‌ను ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు పరిశీలించారు. చెక్‌పోస్ట్ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి చెక్‌పోస్ట్ నిర్వహణకు అనువైన వాతావరణాన్ని కల్పించారు. భీమిలి క్రాస్‌రోడ్ ప్రాంతంలో పోలీసుల నిఘాను మరింత విస్తృతం చేయడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలు వేగంగా అందించే లక్ష్యంతో చెక్‌పోస్ట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ప్రధాన కూడళ్లలో ఆధునాతన నిఘా కెమెరాల ఏర్పాటు, చెక్‌పోస్ట్ పునరుద్ధరణతో ఆనందపురం పోలీసుల పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. నేరాల నియంత్రణతో పాటు ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీసుల చర్యలు అభినందనీయమని ప్రజలు పేర్కొంటున్నారు. నిరంతర నిఘాతో ప్రధాన కూడళ్లలో మరింత భద్రత నెలకొనడంతో పాటు నేరాల నియంత్రణకు ఈ చర్యలు ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# నగర వనమును సందర్శించిన కొణిదెల నాగబాబు

**సూర్యలంక: (సిటిజన్ టైమ్స్); సెప్టెంబర్: 03:**
గుంటూరు జిల్లా బాపట్ల మండలం సూర్యలంక రోడ్డు లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నగర వనం ను ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదల నాగబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశ్ననరేంద్ర వర్మ రాజు ఘనస్వాగతం పలికారు. నగరానికి విచ్చేసిన నాగబాబుకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు శాలువా కప్పి మొక్కను బహుకరించి సాదరంగా ఆహ్వానించారు. నాగబాబు నగరవనం లోని పచ్చదనం, పర్యాటక వసతులు, బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు.



# మురళీ నాదంలో మానవత్వం..

## కృష్ణాష్టమి ప్రత్యేకం -ధర్మ సంస్థాపనకు దివ్య సందేశం ఇచ్చిన శ్రీకృష్ణుడు











**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్( ప్రత్యేకం ):**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో శ్రీకృష్ణుడికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. బాల్యంలో అల్లరి చేసే గోపాలుడిగా, యవ్వనంలో ప్రేమకు ప్రతీకగా, మహాభారతంలో మహోన్నత మార్గదర్శిగా, భగవద్గీత ద్వారా ప్రపంచానికి జీవన సారాన్ని అందించిన జగద్గురువుగా శ్రీకృష్ణుడు కోట్లాది మంది భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన జన్మదినంగా జరుపుకునే శ్రీకృష్ణాష్టమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు.. ధర్మం, ప్రేమ, మానవత్వం, కర్తవ్యబోధను గుర్తుచేసే పవిత్రమైన సందర్భం.

**అల్లరి కృష్ణుడి బాల్యం.. ఆరాధనకు మార్గం**

వెన్నదొంగగా, ముద్దుల గోపాలుడిగా శ్రీకృష్ణుడి బాల్య లీలలు భారతీయుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించాయి. యశోదమ్మ ఒడిలో పెరిగిన బాలకృష్ణుడు తన చిలిపి చేష్టలతో గోకులాన్ని ఆనందమయం చేశాడు. చిన్ననాటి నుంచి ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ధర్మ పరిరక్షణే తన లక్ష్యమని ప్రపంచానికి చాటిచెప్పాడు.

బాలకృష్ణుడి రూపం అంటేనే మన కళ్ల ముందు నెమలి పింఛం, చేతిలో వేణువు, చిరునవ్వుతో కూడిన ముద్దుమోహం కనిపిస్తుంది. ఆ రూపంలో ఉన్నది కేవలం అందం మాత్రమే కాదు.. మనిషి జీవితాన్ని ఆనందంగా, సహజంగా, ప్రేమతో గడపాలనే సందేశం కూడా ఉంది.

**గీతా సందేశం.. జీవితానికి దిక్సూచి**

కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన భగవద్గీత సందేశం యుగయుగాలకూ మార్గదర్శకంగా నిలిచింది. సందిగ్ధంలో ఉన్న మనిషికి ధైర్యం, కర్తవ్యంపై నమ్మకం, ఫలితాన్ని ఆశించకుండా బాధ్యత నిర్వర్తించే తత్వాన్ని గీత ద్వారా బోధించారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మబద్ధంగా ముందుకు సాగాలని, పరిస్థితులకు భయపడి కర్తవ్యాన్ని విస్మరించకూడదని శ్రీకృష్ణుడి జీవితం తెలియజేస్తుంది. అందుకే భగవద్గీతను కేవలం ఆధ్యాత్మిక గ్రంథంగానే కాకుండా జీవిత నిర్వహణకు మార్గదర్శకంగా భావిస్తారు.

**నేటి సమాజానికి కృష్ణ తత్వం అవసరం**

సాంకేతికంగా ప్రపంచం ఎంత ముందుకు వెళ్లినా మానవ సంబంధాల్లో విలువలు తగ్గుతున్నాయనే ఆందోళన కనిపిస్తోంది. స్వార్థం, అసహనం, ద్వేషం పెరుగుతున్న తరుణంలో శ్రీకృష్ణుడి బోధనలు మరింత అవసరమవుతున్నాయి. ప్రేమతో సమస్యలను పరిష్కరించడం, ధర్మం వైపు నిలబడటం, బలహీనులకు అండగా ఉండటం, బాధ్యతతో వ్యవహరించడం వంటి విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరం. శ్రీకృష్ణుడు చెప్పిన సందేశంలో ముఖ్యమైనది కర్తవ్యనిర్వహణ. ఫలితం గురించి ఆందోళన చెందకుండా మన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తే విజయం దానంతట అదే చేరువవుతుందనే భావన తరతరాలకు స్ఫూర్తినిస్తోంది.

**కృష్ణాష్టమి.. భక్తి వెల్లువ**

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలు ప్రత్యేక అలంకరణలతో కళకళలాడుతాయి. భక్తులు ఉపవాస దీక్షలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చిన్నారులను బాలకృష్ణుడు, రాధ పాత్రల్లో అలంకరించి ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకుంటారు. పలు ప్రాంతాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కృష్ణ జన్మాష్టమిని ఘనంగా నిర్వహిస్తారు. ఇంటి ముంగిట చిన్న చిన్న పాదముద్రలు వేస్తూ బాలకృష్ణుడిని ఆహ్వానించడం భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకమైన ఆచారం. ఆ పాదముద్రలు కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు.. ఇంటిలోకి ఆనందం, శాంతి, శుభం రావాలని కోరుకునే భావానికి ప్రతీక.

**ధర్మం వైపు నడిపే దివ్య సందేశం**

శ్రీకృష్ణుడి జీవితం ప్రతి మనిషికీ ఒక పాఠం. బాల్యంలో ఆనందం, యవ్వనంలో ప్రేమ, జీవితంలో బాధ్యత, కష్టకాలంలో ధైర్యం, సమాజంలో ధర్మం.. ఇలా జీవితంలోని ప్రతి దశకు కృష్ణతత్వం ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది. కృష్ణాష్టమి సందర్భంగా కేవలం పూజలు, వేడుకలకే పరిమితం కాకుండా శ్రీకృష్ణుడు అందించిన ప్రేమ, ధర్మం, మానవత్వం, కర్తవ్యబోధలను మన జీవితంలో ఆచరించగలిగితేనే ఆ పండుగకు నిజమైన అర్థం లభిస్తుంది. "మురళీ నాదం వినిపించే చోట మాధుర్యం ఉంటుంది.. కృష్ణ తత్వం ఆచరించే చోట మానవత్వం వెలుగుతుంది."

**అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు.**



## హెల్త్ సెంటర్ ను ప్రారంభించిన శాసనసభ్యులు



**కాళ్ల: (సిటిజన్ టైమ్స్); సెప్టెంబర్; 03;**

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ల మండలం మాలవాని తిప్ప గ్రామంలో హెల్త్ సెంటర్ ను రాష్ట్రశాసనసభ ఉప సభాపతి ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం గ్రామీణ ప్రాంతాలలో హెల్త్ క్లినిక్ లకు స్వంత భవనాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఐఐసి చైర్మన్ రామరాజు, కూటమి నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బద్వేలు సబ్ రిజిస్టర్ విద్యాసాగర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు



**బద్వేలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 3:**

బద్వేల్ సబ్ రిజిస్టర్ పై అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో పలు ఆరోపణలు రావడంతో , బద్వేలు పరిధిలో ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు బద్వేలు సబ్ రిజిస్టర్ విద్యాసాగర్ రెడ్డి పై పలు ఆరోపణలు రావడంతో మరియు ప్రొద్దుటూరు లో హైకోర్టు అటాచ్మెంట్ లో ఉన్న అగ్రిగోల్డ్ భూమిని 2021లో ప్రయివేటు వ్యక్తులకు రిజిస్టర్ చేసినట్లు ఆరోపణ లు ఉన్నాయి. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో సబ్ రిజిస్టర్ ,మరో 9 మందిపై సిఐడి పిర్యాదు మేరకు కేసు నమోదు అయినది బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తిష్ట వేసి కూర్చున్న ప్రయివేటు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ప్రజల వద్ద నుంచి డబ్బులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు, సబ్ రిజిస్టర్ పై ఆరోపణలు రావడంతో సంబంధిత ఉన్నతాధికారులు సబ్ రిజిస్టర్ విద్యాసాగర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ విద్యాసాగర్ రెడ్డి సర్వీస్ కాలంలో లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమాలు బహిర్గతం అయితాయని ఆ రిజిస్టర్ ల వల్ల ఇబ్బంది పడ్డ ప్రజలు, బాధితులు కోరుతున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**బద్వేలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 3:**

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి జబ్బులు రావని సబ్ యూనిట్ అధికారి ఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు గురువారం ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భావన ఆధ్వర్యంలో చింతరాజుపల్లి సచివాలయ పరిధి లోని పత్రపల్లె గ్రామంలో కీటక జనిత వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది.ప్రతి ఇంటికి తిరిగి లార్వా సర్వే మరియు ఫీవర్ సర్వే నిర్వహించడం తో పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ భావన మాట్లాడుతు జ్వరము వచ్చిన వెంటనే వైద్యాధికారి సమక్షంలో రక్తపరీక్షలు మరియు చికిత్స నియమావళి పాటించాలని తెలియపరిచారు.అదనపు జిల్లా మలేరియా అధికారి జి. వెంకటరెడ్డి మాట్లాడుతు ప్రతి ఒక్కరూ దోమతేరలలోనే నిద్రించాలని తెలియపరిచారు. సిద్ధవటం సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతు ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు శివశంకర్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి,సూపర్ వైజర్ భాస్కర్ రెడ్డి,మగ ఆరోగ్య కార్యకర్త వెంకట సిహెచ్ఓ ఈశ్వరి, స్త్రీ ఆరోగ్య కార్యకర్త కారిమున్నిస, ఆశా కార్యకర్త మల్లీశ్వరి పాల్గొన్నారు.

## ధరల పెంపుతో రైతుల ఆవేదన



**అమరావతి: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 03:**

రాష్ట్రంలో ఆక్వా రైతులకు బిగ్ షాక్ తగిలింది. రొయ్యల మేత ధరలు మరోసారి పెరిగాయి. రెండు నెలల వ్యవధిలో బ్లాక్ టైగర్ రొయ్య మేత కిలోకి రూ . 24 వనామి రొయ్యల మేత రూ.18 చొప్పున పెరిగాయి. ధరలు పెరగడంతో ఆక్వా రైతులుఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు చేసిన ధరల విషయం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు డి బి టి ద్వారా ఆర్థిక సాయం




**అమరావతి: (సిటిజన్ టైమ్స్ టైమ్స్); సెప్టెంబర్; 03;**

రాజధాని అమరావతి సచివాలయంలో రాష్ట్ర క్యాబినెట్ సమావే శం ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పొగాకు రైతులకు డి బి టి ద్వారా 94 కోట్ల ఆర్థిక సాయం ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే తోతాపూరి మామిడికి మద్దతు ధర కోసం మార్క్ ఫెడ్ నిధులు అంశంపై చర్చించి 281 కోట్ల నిధులు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ ముసాయిదాకు ఆమోదముద్ర వేసి, మత్స్యరంగంలో కేజీ కల్చర్ను ప్రోత్సహించేందుకు కొత్త విధానం అమలుచేయాలని నిర్ణయించారు.

# రూ.3 కోట్ల విలువైన 600 కిలోల గంజాయి పట్టివేత

### అనకాపల్లి రూరల్ పోలీసుల మెరుపుదాడి.. ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్




**అనకాపల్లి;(సిటిజన్ టైమ్స్)సెప్టెంబర్ 3:**

అనకాపల్లి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు చేపడుతున్న విస్తృత తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు తరలిస్తున్న 600 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌తో పాటు పైలట్‌గా వ్యవహరిస్తున్న హోండా సివిక్ కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ గురువారం మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. జైలు పరిచయంతో గంజాయి రవాణా పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన షేక్ మస్తాన్ వలి ( ఏ-1) గతంలో గంజాయి కేసులో విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో నర్సీపట్నానికి చెందిన ఎ-3తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ద్వారా భారీ స్థాయిలో గంజాయి రవాణాకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని దగుడుపల్లికి చెందిన ఎ-2 నుంచి 600 కిలోల గంజాయిని సేకరించి, తుని సమీపంలో అప్పగిస్తే సరుకు ధరకు అదనంగా రూ.3 లక్షల కమీషన్ చెల్లించేలా ఎ-3 ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు పక్కా ప్లాన్ పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు గంజాయిని ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నడక ద్వారా, మోటార్‌సైకిళ్లపై దఫదఫాలుగా తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. అనంతరం గంజాయిని ఘ్రా39 వూ 6786 నంబర్ గల వ్యాన్‌లో లోడ్ చేశారు. ఈ వ్యాన్‌కు ముందుగా ఘ్రా16 దీజ 0018 నంబర్ గల హోండా సివిక్ కారును పైలట్ వాహనంగా ఏర్పాటు చేసి తుని వైపు తరలించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. సంపతిపురం జంక్షన్ వద్ద పట్టివేత పక్కా సమాచారంతో అనకాపల్లి రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు. రూరల్ ఎస్సై జి. రవికుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది అనకాపల్లి మండలం సంపతిపురం జంక్షన్ వద్ద మాటువేసి గంజాయి లోడుతో వెళ్తున్న వ్యాన్‌ను, దాని ముందు వెళ్తున్న పైలట్ కారును అడ్డుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడటంతో స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు అరెస్ట్.. ముగ్గురు పరారీ ఈ కేసులో - షేక్ మస్తాన్ వలి (ఎ-1) -- ధర్మాజీగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా - షేక్ మదీనా (ఎ-4) - పాంగి రత్నాలు (ఎ-6) -- అల్లూరి సీతారామరాజుజిల్లా లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఎ-2 (ఒడిశా), ఎ-3 (నర్సీపట్నం), ఎ-5 (అల్లూరి సీతారామరాజు జిల్లా) పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. నిందితులపై గతంలోనూ గంజాయి కేసులుఅరెస్టయిన, పరారీలో ఉన్న నిందితుల్లో కొందరిపై గతంలోనూ గంజాయి కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ధర్మపురి లక్ష్మి నర్సింహా స్వామి వారి పునర్నిర్మాన అభివృద్ధి

**సిటిజన్ టైమ్స్,ధర్మపురి,సెప్టెంబర్ 3**

ధర్మపురి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయం సమగ్ర అభివృద్ధి మరియు పునర్నిర్మానం పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. శ్రీ స్వామి వారి క్షేత్రన్ని ఆగమ శస్త్ర నియమల ప్రకారం భక్తుల సౌకర్యర్థమ్ అత్యంత సుందరంగా తీర్చి ధిద్దాడని కి ప్రభుత్వం సిద్ధం గా ఉందని ,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెళ్ళడించారు.



# భక్తి పారవశ్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## హరే కృష్ణ వైకుంఠంలో రెండు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03 :**

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ వైకుంఠం శ్రీశ్రీ రాధా మదనమోహన్ మందిరంలో ఈ నెల 4, 5 తేదీల్లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మధురవాడ, ఆనందపురం, భీమునిపట్నం తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 4న శ్రీకృష్ణ జన్మాష్టమి, 5న వ్యాసపూజ, నందోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండు రోజులపాటు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

**108 పలకలతో హరినామ జప మండపం**

జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా 108 పలకలతో ప్రత్యేక హరినామ జప మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు 108 మార్లు హరినామ జపం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హరినామ జపం ద్వారా మనస్సుకు ప్రశాంతత చేకూరి, భక్తి భావంతో శ్రీకృష్ణుడిని దర్శించుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

**సప్తనదీ జలాలతో మహాభిషేకం**

ఈ నెల 4న ఉదయం శ్రీకృష్ణ భగవానుడికి ప్రాతఃకాల అభిషేకం నిర్వహించనున్నారు. గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి నదుల పవిత్ర జలాలతో పాటు పంచామృతం, వివిధ పండ్ల రసాలు, పుష్పాలతో వేదమంత్రాలు, సంకీర్తనల మధ్య అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి ప్రత్యేక మహాభిషేకం నిర్వహించి, శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర ఘడియలను పురస్కరించుకుని అర్ధరాత్రి మహామంగళ హారతి నిర్వహించనున్నారు. 108 పవిత్ర జల కలశాలు, సప్తనదీ జలాలతో జరిగే ఈ కార్యక్రమం ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

**లడ్డుగోపాలుడికి ప్రత్యేక ఊయల సేవ**

బృందావనం నుంచి తీసుకొచ్చిన లడ్డుగోపాలుడికి ప్రత్యేక ఊయల



సేవ నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊయల సేవలో భాగస్వాములు కావడానికి అవకాశం కల్పించారు.

**ఉట్టి మహోత్సవం.. కృష్ణుడితో సెల్ఫీ**

చిన్నారులు, యువతను ఆకట్టుకునేలా ఉట్టి మహోత్సవంతో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా



"కృష్ణుడితో సెల్ఫీ" కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీ

రెండు రోజులపాటు భక్తులను అలరించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రఖ్యాత కళాకారులు తాడి శ్రీ సంతోషి, పణ్ణాన ప్రియంవద, నౌదురి కాళీప్రసాద్, సింగరాజు ఉమాశ్రీ తదితరులు తమ కళా ప్రదర్శనలతో భక్తులను అలరించనున్నారు. రెండో రోజు సాయంత్రం ప్రత్యేక భజన, సంగీత కచేరీ కూడా నిర్వహించనున్నారు.

**వ్యాసపూజ.. నందోత్సవం**

ఈ నెల 5న హరేకృష్ణ ఉద్యమ ఆచార్యులు శ్రీశ్రీ భక్తివేదాంత స్వామి ప్రభుపాదులవారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకంతో వ్యాసపూజ నిర్వహించనున్నారు. అనంతరం శ్రీకృష్ణ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా నందోత్సవం నిర్వహించి భక్తులకు వివిధ రకాల వంటకాలతో మహాప్రసాద విందు ఏర్పాటు చేయనున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని హరే కృష్ణ వైకుంఠం నిర్వాహకులు శ్రీ అదోక్షజ దాస కోరారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో సందడిగా జన్మాష్టమి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 3**

నాగర్ కర్నూల్ శాంతినికేతన్ మోడల్ స్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, రుక్మిణి, సత్యభామ వేషధారణల్లో అలరించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, ఉత్సాహం అందరినీ ఆకట్టుకున్నాయి. జన్మాష్టమి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేరింతలు, చప్పట్లతో తోటి విద్యార్థులు చిన్నారులను ప్రోత్సహించారు. విద్యార్థుల ఆనందోత్సాహాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. జన్మాష్టమి ప్రాముఖ్యత, శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిదిరే నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓడలరేవు ప్రమాద మృతుడి కుటుంబానికి మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శ



**అల్లవరం: (సిటిజెన్ టైమ్స్): సెప్టెంబర్: 03:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా,అల్లవరం మండలం ఓడలరేవు లో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో జనసేన కార్యకర్త ప్రేమ్ కుమార్ మృతి చెందాడు. మృతుడు ప్రేమ్ కుమార్ కుటుం బాన్ని పరామర్శించారు.మంత్రి నాదెండ్ల మనోహర్. బెండమూ ర్లంకలోని బాధిత కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పి ఆ కుటుంబా న్ని ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన మంత్రి నాదెండ్ల. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.జనసేన అధి నేత పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ బాధిత కుటుంబానికి అండగా ఉంటారని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం బాధిత కుటుం బానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు మంత్రి. కష్టకాలంలో కుటుంబానికి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ.ప్రేమ్ కుమార్ మృతిపై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి కుటుంబానికి భరోసా ఇచ్చారు.మంత్రి నాదెండ్ల మనోహర్.ఈ కార్యక్రమంలో పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ,తుమ్మల బాబు,నల్లా శ్రీధర్,కల్వకొలను తాతాజీ,యాళ్ల దొరబాబు, ఏడిద శ్రీను,మండేల బాబి, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు కమిటీ

### మార్గదర్శకాల సవరణకు 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి ప్యానెల్ ఏర్పాటు




**అమరావతి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03::**

రాష్ట్రంలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాల అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను సవరించేందుకు ప్రభుత్వం 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రవేశాల ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించడం, సీట్ల వివరాలు, ఫీజుల రీయింబర్స్‌మెంట్‌తో పాటు వివక్ష నివారణపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది.

## రాజముద్రత కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి




**బద్వేలు, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 3:**

రైతులు ఇబ్బందులు పడకుండా రాజముద్రలతో కూడిన పట్టాదారు పాసుబుక్కులు ప్రభుత్వం పంపిణీ చేయడం జరుగుతుందని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సూర్యనారాయణ రెడ్డి అన్నారు గురువారం బద్వేల్ నియోజకవర్గం, గోపవరం మండలం ఎన్. రామాపురం(రాచయపేట) గ్రామంలో "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేలు డివిజన్ ఆర్డీఓ చంద్రమోహన్ పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూములకు సంబంధించిన హక్కులను మరింత పటిష్టం చేయడంతో పాటు, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా బార్‌కోడ్ ద్వారా భూ యజమాని వివరాలను పొందుపరిచి, భూమిపై రైతులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం మండల తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, బద్వేలు నియోజకవర్గ కూటమి నాయకులు, గోపవరం మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ముసాయిదా జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించిన... శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి..

**పోలవరం, :(సిటిజెన్ టైమ్స్):సెప్టెంబర్:0 3:**

పోలవరం మండలం చేగొండపల్లి పంచాయతీ గ్రామంలో ప్రత్యేక అధికారి సూర్యనారాయణఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అదే విధంగా జాబితాలో పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తమ పేర్లు ఓటర్ల జాబితాలో నమోదయ్యాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆమె సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు వంటి వివరాలపై కూడా ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేందుకు అధికారులు చేస్తున్న




కృషికి ప్రజలు సహకరించాలని కోరారు.గ్రామంలో ప్రజలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై కూడా గ్రామసభలో చర్చించి, ప్రజల నుంచి అభిప్రాయాలు మరియు సూచనలు స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

## వరుస చోరీలు దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ఉంగుటూరు: (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్ :03:**

కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని ఎస్సై గోవిందు సిబ్బందితో కలిసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. డి.ఎస్.పి ధర్మేంద్ర వివరాల మేరకు ధూళిపూడి శ్యాంబాబు (నాని) 2024 నుంచి 10 దొంగతనాలకు పాల్పడ్డాడని, అదుపులోకి తీసుకొని అతని నుంచి 615 గ్రాముల బంగారం, 2.75 కిలోల వెండి, రూ 60 వేల నగదు రూ 95 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## అధిష్టానం నిర్ణయంపై స్పందించిన చిన్నారెడ్డి

### నాకు పదవులపై ఎలాంటి సోకు లేదు: చిన్నారెడ్డి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 3**

పార్టీ అధిష్టానం నిర్ణయంపై మాజీ మంత్రి చిన్నారెడ్డి స్పందించారు. తనకు పదవులపై ఎలాంటి సోకు లేదని స్పష్టం చేశారు. కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఒక్క పోటుతో కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ పార్టీ పెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ లోనే ఉన్నానని తెలిపారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి కూడా టిల్ ఫర్థర్ ఆర్డర్ అంటూ ఇచ్చారని పేర్కొన్నారు. పదవులు లేకున్నా తన గౌరవం తనకు ఉంటుందని, పదవి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం కూడా చేయలేదని అన్నారు. తన మనుషులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకు వెళ్తే మెడ పట్టి బయటకు దొబ్బుతానని మేఘా రెడ్డి అన్నారని, అయినా అన్నింటినీ భరించానని చిన్నారెడ్డి తెలిపారు.

## నాగర్ కర్నూల్ జిల్లా.... భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 3**

లింగాల మండలం చెన్నంపల్లిలో భర్త మేకల రాములు (41)ను హత్య చేసిన కేసులో భార్య ఎల్లమ్మకు జీవిత ఖైదు పడింది. రాములు తల్లి మాసమ్మ ఫిర్యాదుతో లింగాల పీఎస్ లో క్రైమ్ నంబర్ 150/2024గా బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదైంది. కేసును విచారించిన నాగర్ కర్నూల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి. రమాకాంత్ నిందితురాలికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారని లింగాల ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

# నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు

## సామాన్యులపై ధరల భారం పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి - మంత్రివర్గ ఉపసంఘం





**అమరావతి(సిటిజన్ టైమ్స్):సెప్టెంబర్ 3:**
రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే అమలు చేస్తున్న బియ్యం మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమానికి అదనంగా ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్‌పై తక్షణమే మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ధరల పెరుగుదల ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన కీలక నిత్యావసర వస్తువుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంతో పౌరసరఫరాల శాఖ నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు. లికిలో ఉల్లిపాయలు రూ.35కేలి వినియోగదారులకు కిలో ఉల్లిపాయలను రూ.35కే అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఉల్లిపాయల నిల్వలను రాష్ట్రానికి కేటాయించే అంశాన్ని చీజజఖీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. కేంద్రం నుంచి కేటాయించిన నిల్వలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందుల కేటాయింపునకు విజ్ఞప్తి, కందిపప్పు ధరల నియంత్రణకు కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖను కోరారు. వాటిని ప్రాసెసింగ్ చేసి రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు కందిపప్పుగా వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు** పామాయిల్ ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. చీజజఖీ ద్వారా పామాయిల్ సేకరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఎన్ సి సి ఎఫ్తో సమన్వయం చేసుకుని అవసరమైన పామాయిల్‌ను సమకూర్చి వినియోగదారులకు సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

**651 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు**
బియ్యం ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 651 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్ల ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10,163 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, దాదాపు లక్ష మంది వినియోగదారులు ప్రయోజనం పొందారు. వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే కే ఎన్ ఎంరకం బియ్యాన్ని నెల్లూరు జిల్లాలోని రైస్ మిల్లర్ల నుంచి 10,000 మెట్రిక్ టన్నులు సేకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరకు విక్రయించడం ద్వారా పెద్ద మొత్తంలో బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది. ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. సామాన్య ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో లభించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలువకట్ట వాసులకు 60 ఏళ్ల నిరీక్షణ పూర్తి

### నెల రోజులోనే హామీ నిలబెట్టుకున్న మంత్రి పొంగూరు నారాయణ

### భగత్ సింగ్ కాలనీ సీన్ రిపీట్.. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత పట్టాలు సాధించిన నారాయణ

### మూడు శాఖలను సమన్వయపరిచి సాధించారు.. మంత్రి నారాయణ చొరవపై సీఎం చంద్రబాబు ప్రశంసలు




**నెల్లూరు; (సిటిజన్ టైమ్స్): సెప్టెంబర్: 03:**
నెల్లూరు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతంలో 60 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. భగత్ సింగ్ కాలనీ తరహాలోనే కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పిన మంత్రి, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను స్వయంగా సమన్వయపరిచి ఇచ్చిన హామీని కేవలం నెల రోజుల్లోనే నెరవేర్చి తన మార్క్ చూపించారు. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్‌చే ఆమోదించడంలో కీలక పాత్ర పోషించిన నారాయణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని మరోసారి నిరూపించిన మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటామని నివాసితులు హర్షం వ్యక్తం చేస్తుండగా, త్వరలోనే ఆయన చేతుల మీదుగా పట్టాల పంపిణీ జరగనుంది.

# కృష్ణుడి వేషాల్లో చిన్నారుల సందడి

### కేరళ ఈఎంఈ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 3**
స్థానిక కేరళ ఈఎంఈ హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు చేసిన సందడి, గోపికల రూపంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల సందర్భంగా పాఠశాల అంతా భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాధాన్యతను వివరించారు. శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన భగవద్గీత సందేశాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. భగవద్గీతలోని జీవన సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఆచరించాలని సూచించారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అల్లే శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### పంది మల్లిఖార్జున రావు ఆహ్వానం మేరకు పాల్గొన్న జనసేన నాయకులు ఎమ్ సత్తిబాబు






**నూజివీడు, సెప్టెంబర్ 03,సిటిజన్ టైమ్స్ :**
ముసునూరు మండల పరిధిలో గల లోపూడి గ్రామంలో లో పొడి జనసేన పార్టీ అధ్యక్షులు పంది మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ కార్యక్రమం పంది మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ జై జనసేన అంటూ, జై పవన్ అంటు నినాదాలు చేశారు.కేక్ కటింగ్ తదనంతరం కేక్స్, స్వీట్ లు, బిస్కెట్లు, చాక్లెట్లు, బిర్యానీ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ జరిగింది. ముసునూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మామిడి శెట్టి సత్తిబాబు, లోపూడి టిడిపి పార్టీ అధ్యక్షులు చలమాల వెంకటేశ్వరరావు , లోపూడి పి ఎ సి ఎస్ చైర్మన్ వేంపాటి శ్రీనివాసరావు, చలమాల గంగాధర్ రావు, పొన్నగంటి వేణు,వెంకయ్య, రాటాలు, కృష్ణ, పవన్ కళ్యాణ్ అభిమానులు, కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపేటలోనే గిరిజన బాలికల గురుకులం నిర్మించాలి

### బీజేపీ శ్రేణుల రాస్తారోకో..

### ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర నిరసన



**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 3**
సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు బుధవారం రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్కన్నపేట మండల కేంద్రానికి మంజూరైన గిరిజన బాలికల గురుకుల పాఠశాలను స్థానికంగానే ఏర్పాటు చేయాల్సి ఉండగా, గత పాలకులతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం ఈ పాఠశాలను హుస్నాబాద్‌లో నిర్వహించడం వల్ల అక్కన్నపేట మండల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం అక్కన్నపేట మండల కేంద్రంలో సుమారు ఏడున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించిందని గుర్తు చేశారు. స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ పాఠశాల భవన నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి అక్కన్నపేట మండల కేంద్రంలోనే గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# చిన్నారుల కేరింతల మధ్య ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## ది-ఐ స్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణలు, ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ





**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**
ఆనందపురంలోని ది-ఐ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ఎంతో అందంగా ముస్తాబై ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం చిన్నారుల్లో ఆనందోత్సాహాలను నింపింది. చిన్నారుల కేరింతలు, సందడితో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో స్కూల్ డైరెక్టర్ కాకర సురేష్ కుమార్, ప్రిన్సిపల్ కుప్ప లహరి మార్గదర్శకత్వం అందించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో ఉపాధ్యాయులు లత, రాజేశ్వరి, కుసుమ, కళ్యాణి, రూప ఎంతో కృషి చేశారు. చిన్నారులను వివిధ వేషధారణలకు సిద్ధం చేసి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, రాధాకృష్ణుల రూపాలు, ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం చిన్నారులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించింది.

# ఎగువపల్లిలో సీతారామస్వామి కల్యాణోత్సవ వేడుకలు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 3**
మండలంలోని పెద్దరాజుపాలెం పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో కొలువైన పుణ్యక్షేత్రమైన సీతారామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 5వ తేదీన గ్రామదేవత పూజతో పాటు అంకురార్పణ, 6వ తేదీన సీతారామస్వామి వారి కల్యాణ మహోత్సవము, 7వ తేదీన వసంతోత్సవ కార్యక్రమాలు అలాగే ఉత్సవాల సందర్భంగా 5, 6 తేదీల్లో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం,కల్యాణ మహోత్సవానికి భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని దర్శించుకుని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు.

# హెచ్ఐవీ నివారణకు ముందస్తు జాగ్రత్తలు ముఖ్యం

## బాధితుల వివరాలు వెల్లడిస్తే చట్టపరమైన చర్యలు. -హెల్ప్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్.

**అద్దంకి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిగతులను, ప్రమాద అంచనాను తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం (దిశ), హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, విశ్వభారతి, రాయల్, హర్షిణి జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ?ఈ సందర్భంగా బి.వి.సాగర్ మాట్లాడుతూ.. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన 'రిస్క్ అసెస్మెంట్' క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, అందులోని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా హెచ్ఐవీ పరీక్ష అవసరమో లేదో ఎవరికి వారు సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. అనంతరం విద్యార్థులు, కళాశాలల సిబ్బందితో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించారు. హెచ్ఐవీని తొలి దశలోనే గుర్తిస్తే సకాలంలో వైద్య చికిత్స ప్రారంభించి ఆరోగ్యకరమైన పూర్తి జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని



తెలిపారు.?హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజంలో ఎటువంటి వివక్ష చూపరాదని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బాధితుల వివరాలను బహిర్గతం చేస్తే ఎయిడ్స్ నియంత్రణ చట్టం-2017 ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అసురక్షిత కార్యకలాపాలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఎయిడ్స్, సుఖవ్యాధులపై ఎలాంటి సందేహాలు, సలహాలు కావాలన్నా '1097' టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో హెల్ప్ సంస్థ ఔట్‌రీచ్ కార్యకర్తలు టి.దుర్గాభవాని, వి.మల్లేశ్వరి, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.వి.రత్తయ్య, ఎం.శివరామిరెడ్డి, పి.నర్సింహారావు, టి.శ్రీనివాసరావు, ఎం.రాఘవ, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మూలపల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన టిడిపి నేతలు



**కొమరోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

కొమరోలు మండలం రెడ్డి చర్ల పంచాయతీలోని మూలపల్లి గ్రామంలో గురువారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇంచార్జి పందనబోయిన భూపాల్ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ముమ్మరంగ సాగింది. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల సలహాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇంచార్జి పందన బోయిన భూపాల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటికి పంచి పెడుతూ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజాసేవను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అంతేకాక ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఆ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన ఎస్ ఎల్ ఎఫ్ రిసోర్స్ పర్సన్లు





**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి, తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి కి ఎస్ ఎల్ ఎఫ్ రిసోర్స్ పర్సన్లు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అని. మహిళల సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ ఎల్ ఎఫ్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## గిద్దలూరు మండలం ఆఖరి సర్వ సభ్యసమావేశం

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

గిద్దలూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం గిద్దలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు కడప లక్ష్మి, అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, వాటి పురోగతి , ప్రజలకు అందిస్తున్న సేవలను సమావేశంలో వివరించారు. అలాగే, మండల ప్రజా పరిషత్‌కు చెందిన ప్రాదేశిక సభ్యులను ఘనంగా సన్మానించారు. . ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.వి. మోహన్ కుమార్, మండల ప్రజా పరిషత్ సభ్యులు, మండల స్థాయి అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.




## గిద్దలూరు నియోజకవర్గంలో కరువు మండలాలుగా ప్రకటించాలని , రైతులకు , ప్రజలకు ఉపశమనం కలిగించాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ( ఆలిండియా కిసాన్ సభ అనుబంధం )



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

గిద్దలూరు ఏరియా కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని కలిసి, క్విట్ ఇండియా ఉద్యమం తరహాలో అఖిల భారత స్థాయిలో భారత రాష్ట్రపతికి సాధారణ రైతు సమస్యల మీద ఒక మెమోరాండం ఎమ్మెల్యే కి సమర్పించారు. రైతులకు నష్టం కలిగించే భారత అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తిరస్కరించాలని, నాలుగు కార్మిక కోడ్లను ఉపసంహరించాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025 ఉ విత్తన బిల్లు 2025 ఉ జాతీయ ఆహార భద్రత చట్టాలకు ప్రతిపాదిత సవరణలను ఉపసంహరించుకోవాలని, రైతుల భూ హక్కులను పరిరక్షించాలని, ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులకు సముచిత నష్టపరిహారం అందించాలని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేటీకరణ ఆపాలని, పశువుల ఉ పంటల బీమా ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా అన్ని పొలాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించాలని, 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులకు సామాజిక భద్రతా పింఛను అందించాలని, సహకార సంఘాలను రక్షించాలని కోరారు. అలాగే రైతు సంఘం గిద్దలూరు ఏరియా కమిటీ తరపున ఒక వినతి పత్రం సమర్పిస్తూ గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వర్షాభావ పరిస్థితి నెలకొని ఉందని, సాధారణ వర్షపాతంలో 25శాతం మించి వర్షాలు కురవలేదని, 50 శాతం కంటే తక్కువ పొలాలు సాగయినాయని, భూగర్భ జలమట్టం తగ్గిపోయిందని, వాగులు - వంకలు - చెరువుల్లో నీరు లేదు. కనుక 1966 కేంద్ర ప్రభుత్వ కరువు నిబంధన ప్రకారం గిద్దలూరు నియోజకవర్గం లోని గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, బేస్తవారపేట, కంభం, అర్ధవీడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు, సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించవలసిందిగా ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రం అందించారు. అలాగే గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సమస్యలు, భూముల ఆన్లైన్ సమస్యలు పరిష్కరించవలసిందిగా ఎమ్మెల్యే ని కోరారు దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు, ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలియజేశారు.ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఏ. పి. రైతు సంఘం గిద్దలూరు ాంఖిఅ కమిటీ కన్వీనర్ వి రామకృష్ణ, కమిటీ సభ్యుడు జి ఆంజనేయులు ఉన్నారు.

## దశదినకర్మ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

సి



**ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

శీలంవారిపల్లి గ్రామానికి చెందిన భవాని పెరల్స్ అధినేత మామిడేల శేషయ్య నాయుడు దశ దిన కర్మ గురువారం హైదరాబాద్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొని శేషయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారథి,కదిరి పిచ్చయ్య నాయుడు,ఇరగని చలపతి రావు,వాకా సత్య నారాయణ,కొప్పనాధం మనోహర్, కదిరి బాబు,రావూరి శ్రీను,కొట్టే సుభాష్,మామిడేల కార్తీక్,తదితరులు ఉన్నారు.

## సాంప్రదాయ పండుగల ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియాలి

**యర్రగొండపాలెం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

కుటుంభ వ్యవస్థ ఏర్పడినప్పటినుండి పూర్వికుల నుండి వస్తున్న సాంప్రదాయ పండుగల ప్రాముఖ్యత నేటి విద్యార్థులకు తెలియజేయాలనీ రైన్ బో హైస్కూల్ చైర్మన్ దొంత కిరణ్ గౌడ్, కరస్పాండెంట్ దొంత కిషోర్ గౌడ్ లు అన్నారు.శ్రీకృష్ణాష్టమి పండుగ పురస్కరించుకుని గురువారం ముందస్తు వేడుకలను హైస్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు,రాధాదేవి వేషధారణలో పాఠశాలకు విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల సందడి, అలంకరణలతో పాఠశాల ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల కేరింతలు, సందడితో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. అలాగే శ్రీకృష్ణుని బాల్యలీలలకు సంబంధించిన నృత్యాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి ప్రాముఖ్యత, శ్రీకృష్ణుని జన్మ




సంబంధిత విషయాలు , భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసంపెంపొందించడంతో పాటు సంస్కృతిపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏ ఓ కొమ్ము రవి ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణజన్మాష్టమి శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

బ్రహ్మాండంలో చెడుని పారద్రోలి ధర్మాన్ని ఉద్ధరించడానికి శ్రీమహావిష్ణువు ఎత్తిన దశావతారాలలో 8 అవతారం శ్రీకృష్ణావతారం. ద్వాపర యుగంలో శ్రావణమాసం, కృష్ణపక్షం, అష్టమి రోజున కంసుని చెరసాలలో దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణ భగవానుడు జన్మించాడు. ఆ రోజునే శ్రీ కృష్ణ జన్మాష్టమిగా - కృష్ణ జయంతిగా -- గోకులాష్టమిగా దేశ ప్రజలు జరుపుకొంటారు. నేడు ప్రజలు ఉపవాసదీక్షలతో, ఇండ్లలో ఊయల కీర్తనలతో, ఆలయాలలో అష్టోత్తర , సహస్ర నామ పూజలతో శ్రీకృష్ణ భగవానుని భక్తిశ్రద్ధలతో పూజించి, ఉట్టి తదితర సాంప్రదాయ కార్యక్రమాలలో ఆనందంగా పాల్గొని జీవితంలో సకల శుభాలు పొందాలని కోరుచూ మీకు శ్రీ కృష్ణ జయంతి పండుగ శుభాకాంక్షలు అశోక్ రెడ్డి తెలిపారు.

# కృష్ణుడి జన్మదినం భక్తులకు పర్వదినం

## నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు శ్రీకృష్ణుని చెడుని పారద్రోలి ధర్మాన్ని ఉద్ధరించడానికి మహావిష్ణువు దశావతాలతో ఎనిమిదో అవతారం శ్రీకృష్ణ అవతారం , ద్వాపర యుగంలో శ్రావణమాసం కృష్ణపక్ష అష్టమి తిథి కంసుని చెరసాలలో దేవకి వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించిన సందర్భంగా జన్మాష్టమిని దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు అధర్మం పెరిగిపోయి ధర్మం క్షీణించిన సమయంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. కంసుడి దురాగతాలను అంతం చేసి ధర్మాన్ని స్థాపించిన శ్రీకృష్ణుని బాల్యలీలలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. చిన్నారులను కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలంకరించి వేడుకలు నిర్వహించడం జన్మాష్టమి ప్రత్యేకతగా నిలుస్తుంది.ఈ సందర్భంగా ఆలయాలు అలంకరణ, అర్చనలు, హారతులు నిర్వహిస్తారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట భజనలు, కీర్తనల్లో పాల్గొంటారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటాలు, భజన కార్యక్రమాలు పండుగకు మరింత శోభను తీసుకువస్తాయి. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన ధర్మ సందేశాలను గుర్తు చేసుకుంటూ భక్తులు జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు ధర్మాన్ని కాపాడుతూ సత్యమార్గములో నడవాలని కష్ట సమయంలో ధైర్యంగా ముందుకు సాగాలని సమాజానికి సాటి చెప్పే ఆధ్యాత్మిక పర్వదినముగా భక్తులు భావిస్తారు సుఖంగా హాయిగా ఉన్నట్లు కనిపించిన కృష్ణుడు దానిని కష్టాలు పడినా కూడా ఏనాడు ముఖాన చిరునవ్వు చెదరకుండా నిలిచాడు కృష్ణుడు అన్ని ఆచరించి భరించి కష్టసుఖాలను అనుభవిస్తూ అందరికీ జగద్గురువు గా పిలుస్తారు.

## నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 03**

కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పొదిలి నుంచి కనిగిరికి వచ్చే 132 కేవీ విద్యుత్ లైన్ కు సంబంధించిన టవర్లను షిఫ్టింగ్ చేసే పనులు నేడు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఉమాకాంత్ తెలిపారు ఈ నేపథ్యంలో కనిగిరి, పామూరు 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని సి ఎస్ పురం, వెలిగండ్ల, పామూరు, కనిగిరి, పెద్దచెర్లోపల్లి, హనుమంతునిపాడు మండలాల్లో శుక్రవారం (నేడు) ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, పనులు పూర్తయిన అనంతరం వ్యవసాయ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఈఈ ఉమాకాంత్ తెలిపారు.



# వందల కోట్లు ఎందుకు దండగ? AI 'రామాయణం'తో కన్నుల పండగ!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికత సినీ ప్రపంచంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తోంది. భారీ బడ్జెట్‌లతో ఏళ్ల తరబడి సినిమాలు తీసే విధానానికి ప్రత్యామ్నాయంగా (AI)సాయంతో రూపొందించిన ఫ్యాన్ మేడ్ విజువల్స్, సినిమాలు అద్భుతం అంటూ ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇప్పుడు ఏకంగా 'రామాయణం' కాన్సెప్ట్ మూవీని తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. "వందల కోట్లు ఎందుకు దండగ" అనేలా రూపుదిద్దుకున్న ఈ విజువల్స్ సినీ ప్రియులను ఆశ్చర్యపరుస్తున్నాయి. నితీష్ తివారీ లాంటి దర్శకులు 'రామాయణం' ప్రాజెక్ట్ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతుంటే.. ఈ (AI) క్రియేటర్లు కేవలం కొన్ని గంటలు లేదా రోజుల్లోనే అత్యంత అద్భుతమైన విజువల్ గ్రాండియర్ దృశ్యాన్ని ఆవిష్కరించి బ్రిలియెన్సీని చాటుకున్నారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అంటూ వందల మందికి పేమెంట్లు ఇచ్చే పని లేకుండా పనైపోతోంది.రామాయణం ఏఐ టీజర్‌లో ముఖ్యంగా టాలీవుడ్ దిగ్గజ స్టార్ కాస్టింగ్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సినిమా ఆద్యంతం ప్రిన్స్ మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కాంతివంతమైన-దివ్యమైన లుక్‌తో కనిపిస్తే... మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లక్ష్మణుడి పాత్రలో ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఇక లంకాధిపతి రావణాసురుడిగా మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ని చూపించిన తీరు మెస్మరైజ్ చేస్తోంది. భయానక మాయావి అయిన రాక్షసుడిగా అతడి అభినయం, వైఖరి - గంభీరమైన స్ఫురద్రూపం ఈ టీజర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నితీష్ రామాయణం టీజర్‌తో యష్ కి వచ్చినంత పేరు ఇక్కడ ఎన్టీఆర్‌కి వచ్చింది.వీరితో పాటు సీతాదేవిగా కీర్తి సురేష్, ఊర్మిళగా శ్రీలీల, మండోదరిగా జాన్వీ కపూర్ తమ ప్రశాంతమైన, సౌందర్యవంతమైన రూపాలతో అలరించారు. ఇక దశరథ మహారాజు పాత్రలో నందమూరి బాలకృష్ణ రాజసంతో కూడిన గంభీరమైన లుక్‌లో కనిపించి టీజర్‌కు మరింత మైలేజ్ తెచ్చారు. ఈ నటీనటులందరినీ ఏఐ సాయంతో పర్ఫెక్ట్ రామాయణ పాత్రలుగా మలచిన తీరు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.ఈ కాన్సెప్ట్ టీజర్‌లో భావోద్వేగాలు, యుద్ధ సన్నివేశాలను ఎంతో గ్రాండ్‌గా డిజైన్ చేశారు. తండ్రి దశరథుడి వద్ద శ్రీరాముడు వీడ్కోలు తీసుకునే సన్నివేశాలు... వనవాసానికి ప్రయాణమయ్యే దృశ్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే లంకలో రావణాసురుడి సన్నివేశాలతో పాటు వానర సేన, రాక్షస సేనల మధ్య సాగే భారీ యుద్ధ ఘట్టాలు, రామ్-లక్ష్మణుల వీరోచిత బాణప్రయోగాలు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో డిజైన్ చేయబడ్డాయి.ఏలాంటి డైలాగులతో పని లేకుండా.. కేవలం ఒక శక్తివంతమైన థీమ్ మ్యూజిక్‌ను మాత్రమే ఉపయోగిస్తూ కథను నడిపించిన తీరు టీజర్ స్థాయిని పెంచింది. మాటలవసరం లేకుండా విజువల్స్, నేపథ్య సంగీతంతోనే రామాయణ కావ్యంలోని పవిత్రతను, ఘనతను ఆవిష్కరించడం విశేషం. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సినిమా రంగాన్ని ఎంతటి అద్భుతమైన మలుపులు తిప్పబోతోందో చెప్పడానికి ఈ ఫ్యాన్ మేడ్ -రామాయణ- టీజర్ ఒక ఉదాహరణగా నిలిచింది.



**సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది:**

సినిమా నిర్మాణం అంటేనే భారీ బడ్జెట్లు, ఎండ్-లెస్ లొకేషన్ల వేట, కాస్ట్యూమ్స్, మేకప్, కారవాన్ల హడావుడి, స్టార్ ఆర్టిస్టుల కాల్షీట్ల సమస్యలు, ఖరీదైన టెక్నీషియన్లు , కెమెరా డిపార్ట్‌మెంట్లతో కూడిన సుదీర్ఘమైన షెడ్యూళ్లు. రోజులు తరబడి నటీనటుల కోసం ఎదురుచూడటం.. కోట్లాది రూపాయల ఖర్చుతో సెట్స్ వేయడం వంటివన్నీ సాంప్రదాయ సినిమా మేకింగ్‌లో భాగం. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) అందుబాటులోకి వచ్చాక ఈ శ్రమ, సమయం , ఖర్చులన్నీ ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఎటువంటి లైవ్ సెట్స్... హడావుడి లేకుండా కేవలం కంప్యూటర్ స్క్రీన్ ముందే అనుకున్న కాన్సెప్ట్‌ను అత్యున్నత దృశ్యకావ్యంగా మలచడం సాధ్యమవుతోంది.ప్రస్తుతం ఏఐ ప్రారంభ దశలోనే విజువల్స్.. నటీనటుల రూపాలు.. యుద్ధ ఘట్టాలను ఇంత అద్భుతంగా, సులువుగా ఆవిష్కరిస్తూ గొప్ప మ్యాజిక్ చేస్తోంది. కాన్సెప్ట్ టీజర్లు - గ్రాఫిక్స్ విషయంలో ఏఐ సాధిస్తున్న ఈ పురోగతిని చూస్తుంటే మునుముందు -ఆర్గానిక్ ఇంటెలిజెన్స్- (AI)లేదా మరింత అధునాతన ఏఐ సాంకేతికత వస్తే చలనచిత్ర రంగం ఏ స్థాయికి చేరుకుంటుందో ఊహించడం కూడా కష్టమే. భవిష్యత్తులో సాంకేతికత మరింత పరిణతి చెందితే.. భారీ బడ్జెట్ల అవసరం లేకుండా ప్రతీ ఒక్కరి ఆలోచనలు అత్యుత్తమ దృశ్యరూపాలుగా మారి సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది పలకడం ఖాయం. ఏఐ సినిమాలు చూడలేం అంటూనే గంటల తరబడి ఇప్పుడు కంప్యూటర్లలో యూత్ వాటిని వీక్షిస్తూనే ఉండటాన్ని గమనించాల్సి ఉంది.



## గాయమంటూ దొంగ నాటకాలు.. పాకిస్థాన్ ఓపెనర్?పై రెండేళ్ల బ్యాన్..




పాకిస్థాన్ ఓపెనర్ ఇమామ్-వుల్-హక్ అంతర్జాతీయ కెరీర్ తీవ్ర ప్రమాదంలో పడింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో గాయం పేరుతో దొంగ నాటకలు ఆడారనే తీవ్ర ఆరోపణలతో అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఏకంగా 2 ఏళ్ల పాటు బ్యాన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన ఇమామ్, రెండో టెస్టులో పిక్క కండరాల గాయం నెపంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ అతను నిజమైన గాయంతో బాధపడటం లేదని, కేవలం బ్యాటింగ్ నుంచి తప్పించుకునేందుకే డ్రామా ఆడాడని పాక్ క్రికెట్ బోర్డు (గ్రాజదీ) అనుమానిస్తోంది.

**పీసీబీ హై-లెవెల్ ఇంక్వైరీ:**

ఇమామ్ ఇలా గాయం పేరుతో డ్రామాలు ఆడటం ఇది మొదటిసారి కాదని తెలుస్తోంది. మార్చి 2025లో న్యూజిలాండ్ పర్యటనలోనూ ఇండోర్ నెట్ ప్రాక్టీస్ సమయంలో కుడి కాలి వేలికి గాయమైందంటూ మెడికల్ టీమ్‌ను తప్పుదోవ పట్టించి జట్టు నుంచి తప్పుకున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. తాజాగా లార్డ్స్ టెస్టులో కూడా అదే పునరావృతం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పీసీబీ, ఇమామ్‌పై విచారణకు ఒక హై-లెవెల్ కమిటీని నియమించింది. విచారణలో అతడు దోషిగా తేలితే 1 నుంచి 2 ఏళ్ల పాటు క్రికెట్ ఆడకుండా కఠినంగా నిషేధించనున్నారు.

**మహమ్మద్ రిజ్వాన్ కెరీర్ ఎండ్ కార్డ్:**

మరోవైపు స్టార్ వికెట్ కీపర్, పాక్ మాజీ వైట్ బాల్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ పరిస్థితి కూడా అత్యంత దారుణంగా తయారైంది. మూడో టెస్టుకు ముందే పీసీబీ జట్టు నుంచి తొలగించి పాకిస్థాన్‌కు పంపించిన 7 గురు ఆటగాళ్లలో రిజ్వాన్ కూడా ఉన్నాడు. జట్టులో క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తించడం, మైదానంలో బాధ్యతారాహిత్యంగా చెత్త షాట్లు కొడుతూ వికెట్ పారేసుకోవడంపై పాక్ బోర్డు సీరియస్ అయింది. దీంతో రిజ్వాన్ అంతర్జాతీయ కెరీర్‌కు దాదాపు ఎండ్ కార్డ్ పడినట్లేనని, సమీప భవిష్యత్తులో అతను మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చే అవకాశాలు లేవని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**పాక్ క్రికెట్‌లో ఊచకోత.. షాక్‌లో ఆటగాళ్లు:**

ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన పరాజయాల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఏడుగురు ప్లేయర్లను అర్ధాంతరంగా టూర్ నుంచి తప్పించి స్వదేశానికి పంపడంతో లంక, ఇంగ్లాండ్ సిరీస్‌లు ఆడుతున్న ఆటగాళ్లు షాక్‌లో ఉండిపోయారు. ఒకవైపు డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, మరోవైపు ఇమామ్, రిజ్వాన్ వంటి సీనియర్లపై కఠిన చర్యలతో పాక్ క్రికెట్‌లో ప్రస్తుతం తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

## నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటం లేదు.. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో తన రోల్‌పై ఎంఎస్ ధోనీ క్లారిటీ!




చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి తన రోల్‌పై కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు సీఎస్కే మాజీ ఆటగాడు ఎస్. బద్రీనాథ్ వెల్లడించాడు. రాబోయే సీజన్‌లో ధోనీపై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనిని ఇంపాక్ట్ ప్లేయర్ గా వాడుకోవాలని ఫ్రాంచైజీ భావిస్తున్నప్పటికీ, తాను మాత్రం పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే బరిలోకి దిగుతానని ధోనీ తేల్చిచెప్పాడట. తాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడనని, 20 ఓవర్ల పాటు మైదానంలో ఉంటూ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తానని ధోనీ నాతో వ్యక్తిగతంగా చెప్పాడని బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టం చేశాడు.

**వ్యూహాత్మకంగా మేలైనా.. ధోనీ పట్టుదల అదే:**

వయసు రీత్యా శరీరంలో ఫిట్‌నెస్ సమస్యలు ఎదురవుతున్నందున ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగిస్తే సీఎస్కేకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు జరుగుతుందని బద్రీనాథ్ అభిప్రాయపడ్డాడు. ధోనీ శరీరం సుదీర్ఘ సమయం తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని, అతను కేవలం 16వ ఓవర్ తర్వాతే బ్యాటింగ్‌కు వస్తున్నందున కీపింగ్‌కు బదులు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటమే ఉత్తమమని కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా భావించినట్లు గుర్తు చేశాడు. అయినప్పటికీ, మైదానంలో ఫుల్ టైమ్ ప్లేయర్‌గా ఉండటానికే ధోనీ ప్రాధాన్యత ఇస్తున్నాడని వివరించాడు.

**శివమ్ దూబే బౌలింగ్ వివాదం.. మేనేజ్‌మెంట్‌దే తప్పు:**

మరోవైపు, సీఎస్కే టీమ్‌లో శివమ్ దూబే బౌలింగ్ చేయకపోవడంపై వస్తున్న కథనాలను బద్రీనాథ్ ఖండించాడు. టీమిండియా తరఫున రెగ్యులర్‌గా బౌలింగ్ చేసే దూబేను సీఎస్కే తరఫున ఆడించేటప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన అడ్డువస్తోందనడం సరికాదన్నాడు. దూబే చేత బౌలింగ్ వేయించకపోవడం అనేది పూర్తిగా సీఎస్కే మేనేజ్‌మెంట్ వ్యూహాత్మక లోపమే తప్ప ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్పు కాదన్నాడు. అతనిని కేవలం బ్యాటర్‌గానే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఎందుకు ఉపయోగిస్తున్నారు? అని బద్రీనాథ్ ప్రశ్నించాడు.

**అకీల్ హెుస్సేన్ ప్లేయింగ్ ఎలెవన్ లో తీసుకోండి:**

వెస్టిండీస్ స్టార్ స్పిన్నర్ అకీల్ హెుస్సేన్‌ను ప్లేయింగ్ ఎలెవెంలో నేరుగా ఎంపిక చేయకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా రిజర్వ్‌లో ఉంచడంపై కూడా బద్రీనాథ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అకీల్ హెుస్సేన్ కచ్చితంగా ప్రధాన జట్టులోనే ఉండాలని, కానీ సీఎస్కే మొదట సరిగ్గా బ్యాటింగ్ చేయకపోగానే అదనపు బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా తెచ్చి హెుస్సేన్‌ను బెంచ్‌కే పరిమితం చేస్తోందని మండిపడ్డాడు. ఇది తెలివితక్కువ నిర్ణయం.. మీ సొంత నిర్ణయాల లోపానికి ఐపీఎల్ నిబంధనలను నిందించడం సరికాదంటూ చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు.




Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776